క్లుప్తంగా

నిలకడగా కృష్ణానది ప్రవాహం



జగ్గయ్యపేట: మండలంలోని కృష్ణానది పరివాహక గ్రామాలైన ముక్త్యాల, వేదాద్రి, రావిరాల గ్రామాలలో కృష్ణానది నిలకడగా ప్రవహిస్తోంది. బుధవారం పులిచింతల ప్రాజెక్టు నుంచి 14 గేట్ల ద్వారా ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నాలుగవ రోజు కూడా పలు గ్రామాలలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతుండగా పంట పొలాలు సైతం నీట మునిగి దర్శనమిస్తున్నాయి.

వైరా కట్టలేరు కాజ్‌వే రహదారికి మరమ్మతులు



వీరులపాడు: ఇటీవల వరద కారణంగా మండలంలోని పల్లంపల్లి సమీపంలోని వైరా కట్టలేరు కాజ్‌వే రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అధికారులు జేసీబీతో రహదారిని తాత్కాలికంగా చదును చేసే పనులు చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగలటంతో నిరుపయోగంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. వరదలు వచ్చిన ప్రతిసారీ రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): యువత అన్ని రంగాల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ అన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో విజయదశమి సందర్భంగా అమృత యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి గెలుపులు ఆలోచించకుండా సోదరభావంతో క్రీడాకారులు పాల్గొనాలన్నారు. అనంతరం రవికుమార్‌ను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు కీసర చందు, దోసపాటి ప్రసాద్, దాసరి మోహన్, దైద ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ ద్వారా వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించిందని పశుసంవర్ధకశాఖ డీడీ మోజెస్ వెస్లీ అన్నారు. మండలంలోని ముండ్లపాడు, కొణకంచి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో 50 శాతం సబ్సిడీపై దాణా, 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల షెడ్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. పాలు, పాల పదార్థాలు, పాల క్యాన్లపై జీఎస్టీ తగ్గింపులు వివరించారు. ఈకార్యక్రమంలో పశు వైద్యాధికారి పి.అనిల్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు



నందిగామ రూరల్: రాంగ్ రూట్‌లో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని కంచల గ్రామానికి చెందిన కొమ్ముకూరి లక్ష్మయ్య బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై నందిగామకు వస్తున్నాడు. ఐతవరం గ్రామ శివారులోకి వచ్చే సరికి రాంగ్ రూట్‌లో ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో గాయాలై రోడ్డుపై పడి ఉన్న లక్ష్మయ్యను సమీపంలో ఉన్నవారు గమనించి రోడ్డు పక్కకు తీసుకువచ్చారు. వెంటనే కీసర టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లక్ష్మయ్యను పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం లేదని చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం జరగగానే స్పందించి సకాలంలో ఆస్పత్రికి తరలించిన ప్రభాకర్‌ను పలువురు అభినందించారు.



మహిషాసురమర్దినిగా అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



పల్లగిరి త్రిశక్తి పీఠంలో మహిషాసురమర్దిని అలంకారంలో త్రిమాతలు



నందిగామలో మహిషాసురమర్దినిగా శుకశ్యామలాంబ అమ్మవారు



నందిగామలో కనకదుర్గమ్మ అలంకారంలో మరిడి మహాలక్ష్మీఅమ్మవారు



పెనుగంచిప్రోలు తూర్పు బజారులో మహిషాసురమర్దినిగా

విశ్వవినోదిని

మహిషాసురమర్దినీ

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. పదో రోజైన బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ప్రధాన ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారి విగ్రహాలకు విశేష పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– నందిగామ రూరల్/నందిగామ టౌన్/పెనుగంచిప్రోలు/జగ్గయ్యపేట/కంచికచర్ల/జగ్గయ్యపేట అర్బన్



వీరులపాడు మండలం పెద్దాపురంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు



జగ్గయ్యపేట అర్బన్ పరిధిలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో..



జగ్గయ్యపేట అర్బన్‌లో శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు



పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడులో మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు



జగ్గయ్యపేట తిరుమలగిరిలో మహిషాసుర మర్దిని అలంకారంలో దుర్గాదేవి



జగ్గయ్యపేట ముక్త్యాల భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో మహిషాసురమర్దినిగా..



కంచికచర్ల మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో కాళరాత్రి దేవిగా..



కంచికచర్ల శివసాయి క్షేత్రంలో మహిషాసురమర్దిని దేవి అలంకరణ

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట: కృష్ణానదికి గడిచిన వారం రోజులుగా వస్తున్న వరదలతో నదీ పరీవాహక గ్రామాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లోని పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణానదికి ఎగువ నుంచి వరద ఉధృతంగా వస్తుండటంతో గ్రామంలోని కృష్ణానది, పాలేరు సంగమం వద్ద రిటైనింగ్ వాల్ లేకపోవటంతో కరకట్ట కొట్టుకుపోయి నివాస గృహాలు కూలుతున్నాయన్నారు. వారం రోజుల్లో రెండు గృహాలు పాక్షికంగా దెబ్బతినటంతో పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పాలకులు, అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడలేదని ఆరోపించారు. నదీ పరీవాహక ప్రాంత గ్రామాలలో కూడా మిర్చి, పత్తి పంటలు మూడు రోజులుగా నీటిలో నానుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది పంటలకు వైరస్ సోకి అవస్థలు పడుతుంటే, వరదలు అదనపు నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు. వ్యవసాయాధికారులు పంట నష్టం అంచనాలను తయారు చేసి రైతులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న గృహాల బాధితులకు కూడా న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్నా), గ్రామ కన్వీనర్ యలగాల హరిప్రసాద్, రైతు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కన్నమాల శ్యాముయ్యేల్, రైతు, యూత్ రాష్ట్ర కార్యదర్శులు నంబూరి రవి, శివరాత్రి పృధ్వీ, జిల్లా కార్యదర్శి దేవినేని రామారావు, రైతు కమిటీ జిల్లా కన్వీనర్ ఏలూరి శివాజీ, నాయకులు మాతంగి నాగబాబు, కనగాల రమేష్, బండి రంజిత్, గూడపాటి శేషగిరిరావు, శ్రీహరి, జవ్వాజి నాగబాబు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.



కరకట్టను పరిశీలిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన రాజగోపాల్

ప్రజలకు తన్నీరు దసరా శుభాకాంక్షలు



జగ్గయ్యపేటఅర్బన్: చెడుపై మంచి జరిపిన పోరాటంలో సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా

నందిగామ టౌన్: పట్టణ పరిధిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ లోవరాజు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మునేటిలోని పంపింగ్ స్కీంను నిలుపుదల చేశామన్నారు. పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్న గుడిమెట్ల, కొత్తబెల్లంకొండవారిపాలెం గ్రామ సమీపంలోని స్కీంల నుంచి వచ్చే తాగునీరు రంగు మారి వస్తుండటంతో వాటి నుంచి కూడా తాగునీటిని సరఫరా నిలుపుదల చేసినట్లు తెలిపారు. కంచికచర్ల మండలం కీసర మునేటిలోని రక్షిత మంచి నీటి పథకం నుంచి మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నీటి సరఫరాలో వేళల్లో మార్పులుంటాయని, సరఫరాలో ఇబ్బందులుంటే కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పంటలు వరదపాలు.. రైతుల దిగాలు



కంచికచర్ల మండలం గనిఆత్కూరులో నీట మునిగిన వరిచేను

ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

కంచికచర్ల: ఎగువ ప్రాంతాల నుంచి, ముఖ్యంగా పులిచింతల ప్రాజెక్టు నుంచి కృష్ణానదికి భారీగా వస్తున్న వరదనీటికి నదీతీర ప్రాంతంలోని పంట పొలాలన్నీ నీట మునిగాయి. బుధవారం కూడా పంట పొలాలన్నీ నీటిలో తేలియాడుతున్నాయి. ఎక్కువ రోజుల పాటు పంట పొలాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల మొక్కలన్నీ కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ పెట్టుబడి పెట్టి అప్పులు చేసి పొలాలను కౌలుకు తీసుకుని పంటలు సాగుచేస్తే వరద వల్ల పంట పొలాలన్నీ నీట మునిగాయి. చేతికి వస్తాయనుకున్న పంట పొలాలన్నీ నీటిలో తేలియాడటంతో తిరిగి మరలా ఆ పొలాలను దున్ని సాగుచేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. కృష్ణానదీ తీర గ్రామాలైన మున్నలూరు, కునికెనపాడు, చెవిటికల్లు కొత్తపేట, గనిఆత్కూరు గ్రామాల్లో పంటలన్నీ నీట మునిగాయి. సుమారు 107 ఎకరాలకు పైగా పంట పొలాలు నీట మునిగాయని రైతులు అంటున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలను సాగుచేస్తే వరద తాకిడికి నీట మునిగాయని తెలిపారు. ప్రస్తుతం 6 లక్షల క్యూసెక్కుల వరదనీరు కృష్ణానదికి వస్తుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. అయితే కృష్ణానదిలోకి పశువులు, ప్రజలు ఎవరూ దిగకుండా రెవెన్యూ సిబ్బందిని కాపలా ఉంచామని డీటీ వీ మానస తెలిపారు. నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



కొత్తపేటలో నీట మునిగిన మిర్చితోట

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ వృద్ధుల దినోత్సవం సీనియర్ సిటిజన్, రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ రామాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పదవీ విరమణ అనేది వయస్సుకే కాని మనస్సుకు కాదని, ఈ వయస్సులో కూడా పేదలకు తమ వంతుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం చిట్టిబాబుతో పాటు రామాంజనేయులను విశ్రాంత ఉద్యోగులు శాలువాలతో సత్కరించారు. సంస్థ ఫౌండర్ కేవీ ఆచారి, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



జి.కొండూరు: జి. కొండూరు గ్రామం చెరువు బజారులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ సర్పంచ్ మండల అరుణతో కలిసి బుధవారం ప్రారంభించారు. రోడ్డు పనులను రూ. 5 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టారు. కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, వేములకొండ సాంబశివరావు, కో–ఆప్షన్ సభ్యులు హుస్సేన్, వేములకొండ నవీన్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేములకొండ విష్ణు, నారే ప్రసాద్, బల్ల పంగిదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు గోపాల్‌కు అవార్డు



మైలవరం: మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పి. గోపాల్‌కు ప్రజా సేవారత్న అవార్డును సత్తెనపల్లి ఆశ్రయ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ పరంధామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు గోపాల్ సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందజేశామన్నారు. ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం

తిరువూరు: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ సందర్భంగా తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ ఆవరణలో బుధవారం పలువురు వృద్ధులను సన్మానించారు. సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని, సామాజిక పెన్షను పొందే వృద్ధులకు ఆరోగ్య బీమా, ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఐడియాస్ డైరెక్టర్ అవారి శౌరి ప్రభుత్వానికి సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వృద్ధులకు త్వరితగతిన పనులు జరిగేటట్లు ఆదేశాలివ్వాలన్నారు. ఐడియాస్ సంస్థ కార్యదర్శి మేరీ రాణి, మేనేజింగ్ డైరెక్టర్ అవారి అంతయ్య, కో–ఆర్డినేటర్ కొంగల రవిబాబు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 10వ వార్డు, సీతారామపురంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి పూజా, అన్నదాన కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు రామిని ఉపేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా రైతువిభాగం కార్యదర్శి మోరె దుర్గాప్రసాద్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పి.నర్సింహారెడ్డి, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ అమ్మవారి పూజా కార్యక్రమంలో తన్నీరు నాగేశ్వరరావు, చిన్నా తదితరులు

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు వెంకయ్య మృతి



సత్తి వెంకయ్య (ఫైల్)

మక్కపేట(వత్సవాయి): వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు సత్తి వెంకయ్య (49) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని మక్కపేట గ్రామానికి చెందిన వెంకయ్య గత రెండేళ్లుగా పార్టీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వెంకయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నా, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కనగాల రమేష్ తదితరులు వెంకయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఘనంగా సండేస్కూల్ ఫెస్టివల్



కీసర(కంచికచర్ల): మండలంలోని కీసర గ్రామంలోని జీసస్ క్రైస్ట్ ఫెయిర్ టవర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సండే స్కూల్ ఫెస్టివల్‌ను బుధవారం నిర్వహించారు. పాస్టర్ డాక్టర్ గోసంగి జాన్‌బాబు మాట్లాడుతూ క్రీస్తుకు చిన్న పిల్లలంటే ఎంతో ఇష్టమన్నారు. హైద్రాబాద్‌కు చెందిన దైవజనులు తిమోతి మాట్లాడుతూ ఏసు ప్రభువు లోక రక్షకుడన్నారు. బైబిల్ స్కూల్ ఇన్‌చార్జి బత్తుల రాజా మాట్లాడారు. అనంతరం క్రీస్తు సన్నుతిగీతాలు ఆలపించారు. 1500 మందికి ప్రేమ విందు అందచేశారు. కార్యక్రమంలో గోసంగి మేర్సీ, హోసన్నా పాల్ గోసంగి లిల్లీ, బత్తుల హవేలా, జగదీష్ జాన్ ఆస్టిన్, డానియేల్ పాల్ హేమంత్, బర్నబా, జాన్‌మార్క్ విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జీఎస్టీపై మత్స్యకారులకు అవగాహన



ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ఇటీవలి కాలంలో తగ్గించిన జీఎస్టీ ధరలపై మత్స్యకార సంఘాలకు అవగాహన సదస్సు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కమర్షియల్ ట్యాక్స్, మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మత్స్యశాఖ జిల్లా అధికారి సీఎస్ చక్రాణి మాట్లాడుతూ 99 శాతం వస్తువులపై పన్ను సేవలు తగ్గించారని చెప్పారు. పరోక్ష పన్ను విధానం సేవింగ్‌ను వివరించారు. కమర్షియల్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీఓ శకుంతల, మత్స్యకార సంఘ నాయకులు పాల్గొన్నారు.